సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

గురువారం । 15 । మే । 2025



చీనీ టన్ను రూ.31,200

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో బుధవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.31,200, కనిష్టంగా రూ.5 వేల ప్రకారం ధర పలికాయి.



రూ.14,051 కోట్లతో రుణ ప్రణాళిక

వార్షిక రుణ ప్రణాళిక (2025-26)ను కలెక్టర్ టీఎస్ చేతన్ బుధవారం విడుదల చేశారు. అత్యధికంగా వ్యవసాయ రంగానికి రూ.10,341 కోట్లు కేటాయించారు. 8లో



జిల్లాలో బుధవారం ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గాయి. వేసవితాపం అధికంగా కొనసాగుతోంది. గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

అందరికీ ధన్యవాదాలు

- జగన్ పర్యటన విజయవంతంపై ఉషశ్రీచరణ్

గోరంట్ల: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలుపుతున్నట్లు వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ తెలిపారు. ఆ మేరకు బుధవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. వీర జవాన్ మురళీ నాయక్ కుటుంబీకులను పరామర్శించేందుకు మంగళవారం వైఎస్ జగన్ కల్లితండా రాగా, జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో వైఎస్సార్ సీపీ శ్రేణులు, అభిమానులు తరలి వచ్చి విజయవంతం చేశారన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లా నలుమూలల నుంచి అశేష ప్రజానీకం వచ్చి జగన్‌మోహన్‌రెడ్డి కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమ విజయానికి శక్తి వంచన లేకుండా కృషి చేసిన పార్టీ నాయకులకు, కార్యకర్తలకు పార్టీ తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు వెల్లడించారు.

'ఓపెన్' పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయండి

- డీఆర్‌ఓ విజయ సారథి ఆదేశం



సమీక్షిస్తున్న డీఆర్‌ఓ విజయ సారథి

ప్రశాంతి నిలయం: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో నిర్వహించే పది, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని డీఆర్‌ఓ విజయ సారథి ఆదేశించారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఓపెన్ పది, ఇంటర్ పరీక్షల ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... మే 19 నుంచి 24వ తేదీ వరకు ఓపెన్ పది, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ఉంటాయన్నారు. జిల్లా నుంచి 7,056 మంది విద్యార్థులు పరీక్ష హాజరుకానుండగా, 45 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. రోజూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు ఉంటాయన్నారు. విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా పరీక్ష కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలన్నారు. పరీక్షలు జరిగే సమయంలో కేంద్రాల సమీపంలోని జిరాక్స్ షాపులను మూసివేయించాలన్నారు. పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లకు అనుమతి లేదన్నారు. సమావేశంలో డీఈఓ కృష్ణప్ప, ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక పీఠం అధికారులు పాల్గొన్నారు.

ముజఫర్ అలీ కన్నుమూత



ముజఫర్ అలీ(ఫైల్)

కదిరి: కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న కదిరి మున్సిపల్ మాజీ చైర్మన్ ముజఫర్ అలీ(62) బుధవారం తుదిశ్వాస విడిచారు. అనారోగ్యం కారణంగా ఇంటికే పరిమితమైన ఆయన... రెండేళ్లుగా భార్యతో కలిసి కర్నూలు జిల్లా ఆదోనిలో ఉంటున్నారు. ఆరోగ్య పరిస్థితి విషమించడంతో అక్కడే కన్నుమూశారు. ఆయన తండ్రి నిజాంవలీ కదిరి మున్సిపల్ చైర్మన్‌గా, రాష్ట్ర మంత్రిగా కూడా పని చేశారు. తండ్రి మరణానంతరం ముజఫర్ అలీ చిన్న వయసులోనే కదిరి మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నికై ఎంతోమంది అభిమానాన్ని చూరగొన్నారు. ముజఫర్ అలీ మృతి వార్త తెలియగానే కుటుంబ సభ్యులు ఆదోనికి వెళ్లి భౌతిక కాయాన్ని కదిరికి తీసుకొచ్చి ఖననం చేశారు. పలు రాజకీయ పార్టీల నాయకులు, పట్టణ ప్రముఖులు, అభిమానులు ముజఫర్ అలీ భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

కమనీయం.. పుష్పయాగం



లక్ష్మీచెన్నకేశవస్వామి ఉత్సవమూర్తులకు పుష్పయాగం చేస్తున్న అర్చకులు

ధర్మవరం అర్బన్: పూల పరిమళాలు... వివిధ రకాల పుష్పాల అభిషేకాలతో శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీ చెన్నకేశవస్వామి పుష్పయాగం కమనీయంగా సాగింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరి రోజు బుధవారం ఉదయం 9 గంటలకు పొరాళ్ల పుల్లయ్య కుటుంబ సభ్యులు 28 రకాల పుష్పాలను ఊరేగింపుగా తీసుకువచ్చి స్వామివారికి సమర్పించారు. అన్నమయ్య సేవా మండలి సభ్యులు సహస్ర నామాలతో అన్నమయ్య సంకీర్తనలను ఆలపించారు. సాయంత్రం శయనోత్సవంతో బ్రహ్మోత్సవాలు ముగిశాయి.

అనకొండల్ని ఆపేదెవరు?

ఉమ్మడి అనంతపురం జిల్లాలో సహజ వనరుల లూటీ విచ్చలవిడిగా జరుగుతోంది. మట్టి, ఇసుక, గ్రావెల్ మొదలుకొని అన్నింటినీ 'తెలుగు తమ్ముళ్లు' దోపిడీ చేస్తున్నారు. 'పచ్చ' నేతల హస్తం ఉండటంతో తనిఖీలకు వెళ్లేందుకు మైనింగ్ అధికారులు జంకుతున్నారు.



అనంతపురం రూరల్ మండలం క్రిష్ణంరెడ్డిపల్లి సమీపంలోని పెద్దకొండ వద్ద టీడీపీ నాయకుల మట్టి దోపిడీకి నిదర్శనం ఈ చిత్రం (ఫైల్)

సహజ వనరుల స్వాహాపర్వం

- ఉమ్మడి అనంతపురం జిల్లాలో విచ్చలవిడిగా దోపిడీ
- రోజూ వందలాది టిప్పర్ల ఇసుక, మట్టి కర్ణాటకకు
- కొండలు కరిగిపోతున్నా.. గుట్టలు నేలమట్టమవుతున్నా ఎవరికీ పట్టని వైనం

సాక్షి ప్రతినిధి, అనంతపురం: మట్టి, ఇసుక, గ్రావెల్ తదితర వాటిని వాణిజ్య అవసరాలకు తరలించే వాహనాల నుంచి రాయల్టీ డబ్బు వసూలు చేసేందుకు ప్రభుత్వం ఏదైనా ప్రైవేటు సంస్థకు లీజు కట్టబెట్టేది. లీజు దక్కించుకున్న సంస్థ నెలానెలా ప్రభుత్వానికి రాయల్టీ రూపంలో కొంత మొత్తం చెల్లించేది. దీంతో ప్రభుత్వానికి ఆదాయం లభించేది. అయితే, జిల్లాలో ప్రైవేటు సంస్థ లీజు గడువు మార్చితోనే ముగిసింది. తర్వాత ఇప్పటివరకూ ఎవరికీ ఇవ్వలేదు. దీంతో అప్పటి నుంచి సహజ వనరుల అక్రమ రవాణాకు అడ్డూ అదుపు లేకుండా పోయింది.

11 మాసాల్లోనే కొండల నేలమట్టం..

'కూటమి' అధికారంలోకి వచ్చిన 11 మాసాల్లోనే అనంతపురం సమీప ప్రాంతాల్లో కొండలు కరిగిపోయాయి. గుట్టలు నేల మట్టమయ్యాయి. రాప్తాడు నియోజకవర్గంలోని క్రిష్ణంరెడ్డి పల్లి గుట్టలను కరిగించేశారు. రోజూ ఇక్కడి నుంచి వంద నుంచి 150 టిప్పర్ల మట్టి కర్ణాటకకు పంపిస్తున్నారు. ఇక్కడికి ఇద్దరు మైనింగ్ అధికారులు వెళ్లి వెనక్కు వచ్చారు. మహిళా అధికారులు మట్టి దొంగలను నిలువరించలేకపోయారు. ఇక.. ఆలమూరు కొండలంటే ఈ ప్రాంతంలో ప్రసిద్ధి. పశుపక్ష్యాదులకు ఆలవాలంగా ఉండటమే కాదు రాప్తాడు, అనంతపురం ప్రాంతాలకు రక్షణ కవచంలా ఉండేవి. అలాంటి కొండలను నేలమట్టం చేశారు. చివరకు కరెంటు పోల్లు కూడా కిందపడిపోయేలా మట్టిని తవ్వారు. స్థానిక టీడీపీ నేత ఆధ్వర్యంలో అక్రమ వ్యవహారం ఇష్టారాజ్యంగా జరుగుతోంది.

కరిగిపోయిన నేమకల్లు గుట్టలు

రాయదుర్గం నియోజకవర్గం నేమకల్లులో జరుగుతున్న మైనింగ్.. రాష్ట్ర చరిత్రలోనే పెద్దదిగా చెప్పొచ్చు. మైనింగ్ డాన్‌గా పేరుగాంచిన టీడీపీ నేతలిద్దరు భారీగా క్రషర్‌లు పెట్టి కొండలను పిండి చేస్తున్నారు. ఆరు హెక్టార్లు లీజు ఉంటే 50 ఎకరాల్లో తవ్వుతున్నారు. రూ.20 కోట్ల పెనాల్టీ వేస్తే దాన్ని మాఫీ చేయించుకునేందుకు యత్నిస్తున్నారు.

'తాడిపత్రి'లో విచ్చలవిడిగా...

తాడిపత్రి నియోజకవర్గంలోని యాడికి, పెద్దపప్పూరు మండలాల్లో ఇసుక, మట్టి దోపిడీ యథేచ్ఛగా జరుగుతోంది. పెద్దపప్పూరు మండలంలోని సోమనపల్లి, తిమ్మనచెరువు గ్రామాల్లో విచ్చలవిడిగా మట్టిని తవ్వి రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అమ్ముతున్నారు. ఇంత జరుగుతున్నా చర్యలు తీసుకునేవారే లేరు.

ఆత్మకూరు మండలంలో తారస్థాయికి..

ఆత్మకూరు మండలంలో ఎర్రమట్టి దందా తారస్థాయికి చేరింది. 'తెలుగు తమ్ముళ్లు' మట్టి దందాను అప్రతిహతంగా కొనసాగిస్తున్నారు. అనంతపురం కళ్యాణదుర్గం రోడ్డు ప్రాంతం మొత్తం ఇప్పటికే వెంచర్లతో నిండిపోయింది. ఈ క్రమంలో ఆత్మకూరు మండలం వడ్డుపల్లి గ్రామానికి చెందిన టీడీపీ నేతలు ఎలాంటి గ్రావెల్ లీజులు లేకుండానే కొండలను పిండి చేసి అక్రమంగా మట్టి రవాణా సాగిస్తున్నారు.

హిందూపురంలో పట్ట పగలే దోపిడీ..

హిందూపురం పట్టణం చుట్టూ ఉన్న రూరల్ ప్రాంతాల నుంచి మట్టి యథేచ్ఛగా కర్ణాటకకు తరలిస్తున్నారు. గ్రామస్తులు అడ్డుకుంటున్నా వినకుండా మట్టి తోలుతున్నారు. ఎమ్మెల్యే బాలకృష్ణ పీఏల అండగా తెలుగు తమ్ముళ్లు చెలరేగిపోతున్నారు. ఎక్కడ చూసినా మట్టి, ఇసుక టన్నుల కొద్దీ కర్ణాటకకు వెళ్లిపోతోంది.

లీజు ఉన్న సమయంలో ప్రభుత్వానికి వచ్చిన ఆదాయ వివరాలు ఇలా..

నెల	రాయల్టీ సొమ్ము
2024 డిసెంబర్	రూ.9.5 కోట్లు
2025 జనవరి	రూ.9.8 కోట్లు
2025 ఫిబ్రవరి	రూ.9.6 కోట్లు
ప్రైవేటు లీజు రద్దయిన తర్వాత రాయల్టీ ఇలా..	
2025 మార్చి	రూ.1.20 కోట్లు
2025 ఏప్రిల్	రూ.1.27 కోట్లు

ధర్మవరం నియోజకవర్గంలో..

ధర్మవరం నియోజకవర్గంలోని చిత్రావతి నది నుంచి రోజూ వందలాది టిప్పర్ల ఇసుక అక్రమంగా తోలుతున్నా పట్టించుకునే దిక్కులేదు. ప్రధాన హైవేలోనే నిర్భయంగా టిప్పర్లు వెళుతున్నా రెవెన్యూ అధికారులు గానీ, మైనింగ్ అధికారులు గానీ వాహనాలను పట్టుకోలేదు. టీడీపీ వాహనాలు అనగానే పోలీసులు వాటికి రాచబాట వేసి మరీ బార్డరు దాటిస్తున్నారు.

యథేచ్ఛగా ఎర్రమట్టి దోపిడీ



కొండను తవ్వి మట్టిని తరలించిన దృశ్యం

రాయదుర్గం టౌన్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత టీడీపీ నేతల దోపిడీకి అంతులేకుండా పోతోంది. సహజ వనరులను యథేచ్ఛగా కొల్లగొట్టి రూ. కోట్లలో దోచేస్తున్నారు. టీడీపీ నేతల స్వార్థానికి రాయదుర్గం నియోజకవర్గంలో సహజ సిద్ధంగా ఏర్పడిన కొండలు, గుట్టలు కరిగిపోతున్నాయి. గత రెండు రోజులుగా రాయదుర్గంలోని శనీశ్వరాలయం వెనుక ఉన్న హౌసింగ్ లే అవుట్‌కు ఆనుకుని కొండ ప్రాంతంలో మట్టిని తవ్వి అక్రమంగా తరలిస్తున్నారు. అదే ప్రాంతంలో కొండ పొరంబోకు స్థలంలో భారీ విస్తీర్ణాన్ని చదును చేసి ప్లాట్లుగా మార్చి విక్రయించేందుకు ఓ టీడీపీ నాయకుడు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నట్లు ఆ పార్టీ నాయకులే పేర్కొంటున్నారు. ఎంసీపీ కళాశాల, ఇందిరమ్మ లేఅవుట్లు, గౌడ లేవుట్ సమీపంలో ఉన్న కొండల్లో నుంచి గ్రావెల్ తవ్వకాలు పెరిగిపోయాయి. రోజూ పదుల సంఖ్యలో ట్రాక్టర్లలో ఎర్రమట్టిని తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. రియల్ ఎస్టేట్ వెంచర్లకు, ప్రైవేటు వ్యక్తులు తమ స్థలాలను ప్లాట్లు వేసి, రోడ్లను చదును చేసేందుకు కొండల నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్నట్లు సమాచారం. ఈ విషయం తెలిసినా భూగర్భ గనుల శాఖ, రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

అంధకారంలో 20 పల్లెలు



ఒడ్డుకిందతండాలోని ఓ వీధిలో అలుముకున్న అంధకారం

- ఈదురుగాలులతో నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు
- మూడు రోజులుగా అంధకారంలోనే మగ్గుతున్న ప్రజలు
- విద్యుత్ సరఫరా పునరుద్ధరణలో అధికారుల తాత్సారం

ముదిగుబ్బ: మండలంలోని మల్లేపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని 20 పల్లెల్లో అంధకారం అలుముకుంది. మూడు రోజుల క్రితం ఈదురుగాలులతో కూడిన వర్షాలకు తప్పెటవారిపల్లి సమీపంలో 33 కేవీ లైన్‌కు సంబంధించిన మూడు విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. అదే సమయంలో సబ్‌స్టేషన్ లోనూ కొన్నిచోట్ల డ్యామేజీ జరిగింది. దీంతో మల్లేపల్లి, తప్పెటవారిపల్లి, ఒడ్డుకింద తండా, కొండగట్టుపల్లి పంచాయతీల పరిధిలోని 20 గ్రామాలకు సోమవారం రాత్రి నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఆ రాత్రంతా చీకట్లోనే ఇబ్బందిపడిన ప్రజలు మంగళవారం ఉదయం లైన్‌మెన్లను ఆరా తీశారు. ఇదిగో గంటలో కరెంట్ వస్తుంది.. మధ్యాహ్నం.. సాయంత్రం ఇలా చెప్పుకుంటూ వచ్చారు. గంటలు పోయి.. రోజులు గడుస్తున్నా ఎటువంటి పురోగతీ లేదు. మూడు రోజులైనా అధికారులు స్పందించకపోవడం, ఫోన్ చేసినా రిసీవ్ చేసుకోకపోవడం, విద్యుత్ సరఫరా పునరుద్ధరించకపోవడం విమర్శలకు తావిస్తోంది. అసలే వేసవి. ఉక్కపోత అధికంగా ఉంది. కరెంటు లేక ఫ్యాన్లు, కూలర్లు ఆగిపోయాయి. జనం అల్లాడిపోతున్నారు. చిన్నారులు, వృద్ధుల పరిస్థితి ఇబ్బందికరంగా ఉంటోంది. సెల్‌ఫోన్లు కూడా చార్జింగ్ అయిపోయాయి. సమాచార వ్యవస్థ స్తంభించిపోయింది. ఈ పరిస్థితుల్లో ఉన్నతాధికారులు స్పందించి కరెంటు సరఫరా పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.

పెళ్లి పేరుతో.. టోకరా



- ఆస్తి కాజేసి ఉడాయిస్తున్న యువతులు
- మధ్యవర్తిత్వం చేసిన వ్యక్తుల ఫోన్ స్విచ్ ఆఫ్
- 'పెళ్లి కాని ప్రసాద్'లనే టార్గెట్ చేస్తున్న మోసగాళ్లు
- పోలీసులను ఆశ్రయిస్తున్న బాధితులు



- హిందూపురం మండలం రాచపల్లికి చెందిన 40 ఏళ్ల వ్యక్తి మ్యారేజీ బ్యూరో ద్వారా భీమవరానికి చెందిన మహిళను వివాహం చేసుకున్నారు. సంబంధం కుదిర్చిన ఇద్దరు వ్యక్తులకు రూ.4 లక్షలు చెల్లించాడు. అయితే వివాహం తర్వాత సదరు యువతిని రైలులో భీమవరానికి తీసుకువెళ్లగా.. రైల్వే స్టేషన్ నుంచే ఆమె ఉడాయించింది. ఫోన్ స్విచాఫ్ వచ్చింది. పెళ్లి చేసిన మధ్యవర్తుల నంబర్లూ పనిచేయలేదు. దీంతో బాధితుడు తిరిగివచ్చి.. హిందూపురం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఘటన 2024 అక్టోబరులో వెలుగు చూసింది.
- నాలుగు నెలల క్రితం ధర్మవరానికి చెందిన ఓ యువతిని పుట్టపర్తిలో పని చేసే ఓ ఉద్యోగి పెళ్లి చూపులు చూశాడు. ఆ వెంటనే సదరు యువతి బంధువులు పెళ్లిపత్రికలు ప్రింట్ చేయించారు. తాను పెళ్లికి అంగీకారం తెలపకుండానే పత్రికలు ఎలా ప్రింట్ చేయించారని అడగ్గా... తనను మోసం చేశాడని రూ.5 లక్షల పరిహారం ఇవ్వాలని సదరు యువతి నాలుగు నెలల క్రితం నానా రభస చేసింది. దీంతో ఆ ఉద్యోగి అప్పటి నుంచి పోలీసు స్టేషన్ల చుట్టూ తిరుగుతూనే ఉన్నాడు.
- ఏడాదిన్నర క్రితం కనగానపల్లి మండలంలోని బాలేపాళ్యంకు చెందిన ఇద్దరు యువకులు మ్యారేజీ బ్యూరో ద్వారా గోదావరి జిల్లాలకు చెందిన అమ్మాయిలను వివాహం చేసుకున్నారు. పెళ్లి సమయంలోనే బంగారు నగలు చేయించారు. రెండు, మూడు నెలల పాటు కాపురం చేసి ఆ తర్వాత బంగారు ఆభరణాలతో ఓ యువతి పత్తా లేకుండా పోయింది. ఆమె పరారైన నెలన్నర తర్వాత మరో యువతి కూడా బంగారు నగలతో ఉడాయించింది. దీంతో బాధిత యువకులు మ్యారేజ్ బ్యూరో నంబర్లను సంప్రదించగా స్విచాఫ్ వచ్చాయి.

సాక్షి, పుట్టపర్తి

గతంలో పెళ్లంటే... పెద్దలు కూర్చుని బంధువర్గాల్లో ఈడు, జోడు చూసి సంబంధం కుదుర్చేవారు. ఎక్కువగా బంధువర్గాల్లోని అమ్మాయిలతోనే వివాహం జరిపించేవారు. కానీ ప్రస్తుత కాలంలో అమ్మాయిలు దొరకడం కష్టంగా మారింది. ఫలితంగా 30 ఏళ్ల దాటి.. 40 ఏళ్లకు సమీపిస్తున్నా.. పెళ్లి సంబంధాలు వెతుకుతున్న వారి సంఖ్య ఏటా పెరుగుతూనే ఉంది. దీంతో 'పెళ్లి కాని ప్రసాద్' లను లక్ష్యంగా చేసుకుని కొందరు యువతులు, మ్యారేజీ బ్యూరో నిర్వాహకులు మోసాలకు పాల్పడుతున్నారు. పెళ్లి పేరుతో బంగారు నగలు, నగదు చేజిక్కించుకుని ఉడాయిస్తున్నారు. ఇంకొన్ని చోట్ల ఆస్తి రాయించుకుని అడ్డం తిరుగుతున్నారు.

వయసు మీరితే మోసపోయినట్లే..

అప్పట్లో అబ్బాయిలకు 21, అమ్మాయిలకు 18 ఏళ్లు నిండితేనే వివాహం జరిపించే వాళ్లు. అయితే ప్రస్తుతం ఉద్యోగాల వేటలో పడి 30 ఏళ్లు దాటినా పెళ్లి సంబంధాలు చూడటానికి యువకులు మొగ్గు చూపటం లేదు. ఆ తర్వాత ఏదో ఉద్యోగం లభించాక పెళ్లి సంబంధాలకు వెళ్తే...అమ్మాయిల కోర్కెల చిట్టా చూసి ఖిన్నులవుతున్నారు. రూ.లక్షల్లో జీతంతో పాటు అత్తమామ బాదరబందీ ఉండకూడదంటూ షరతులు పెడుతున్నారు. దీంతో యువకులు నచ్చిన భాగస్వామి కోసం మ్యారేజీ బ్యూరోలను సంప్రదిస్తున్నారు. ఇదే అదునుగా మధ్యవర్తులు ఇతర ప్రాంతాల అమ్మాయిలను ఒప్పించి.. ఒకట్రెండు నెలలు కాలయాపన చేసి.. ఆలోపు డబ్బులు, ఆస్తులు లాగేసుకుని పరారవుతున్నారు.

కొన్ని సామాజిక వర్గాల్లో మరీ కష్టం..

కొన్ని సామాజిక వర్గాల్లో అమ్మాయిల సంఖ్య మరీ దారుణంగా ఉంది. మండలానికి నాలుగైదు కుటుంబాలు ఉండే కులాల్లోని యువకులకు పెళ్లి పెద్ద సమస్యగా మారింది. మరోవైపు ఆస్తి తక్కువగా ఉండే అగ్రవర్ణ యువకులదీ ఇదే పరిస్థితి. ఫలితంగా యువకులు... ఎవరైతే ఏంటి..పెళ్లయితే చాలు అనే పరిస్థితికి వచ్చారు. దూర ప్రాంతాలకు వెళ్లి సామాజికవర్గం ఏదైనా సరే ఎవరో ఒక అమ్మాయిని పెళ్లిచేసుకుని వస్తున్నారు. అయితే రెండు, మూడు నెలల్లోనే సదరు యువతులు టోకరా వేసి బంగారం, నగదుతో ఉడాయిస్తున్నారు.

మడకశిరలో ప్రజాస్వామ్యం ఖూనీ

- అడ్డదారుల్లో మున్సిపాలిటీ కైవసానికి కూటమి కుట్ర
- వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లకు ప్రలోభాలు.. క్యాంపునకు తరలింపు
- నేడు మున్సిపల్ చైర్ పర్సన్, వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం
- వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లకు విప్ జారీ చేసిన పార్టీ హైకమాండ్



మడకశిర: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరినప్పటి నుంచి టీడీపీ నేతలు రెచ్చిపోతున్నారు. పెత్తనం చేసేందుకు ఎంతకైనా దిగజారుతున్నారు. ఈ క్రమంలోనే గత స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ చేజిక్కించుకున్న స్థానాలను సొంతం చేసుకునేందుకు దిగజారి రాజకీయం చేస్తున్నారు. ఇప్పటికే పలు చోట్ల అడ్డదారుల్లో పీఠాలను దక్కించుకున్న టీడీపీ నేతలు మడకశిర మున్సిపాలిటీని అప్రజాస్వామికంగా కైవసం చేసుకోవడానికి రంగం సిద్ధం చేశారు. వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లను ప్రలోభాలకు గురి చేస్తున్నారు.

ఐదుగురితో అధికారం దక్కించుకోవాలని..

మడకశిర మున్సిపాలిటీలో 20 వార్డులుండగా... గత స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులు 15 స్థానాల్లో ఘన విజయం సాధించారు. టీడీపీ 5 స్థానాలతో సరిపెట్టుకుంది. దీంతో చైర్‌పర్సన్‌గా దళిత సామాజిక వర్గానికి చెందిన లక్ష్మీనరసమ్మ, వైస్ చైర్మన్‌గా రామచంద్రారెడ్డి ఎన్నికయ్యారు. వీరిద్దరినీ ఎలాగైనా పదవుల నుంచి తప్పించాలని టీడీపీ నేతలు ప్లాన్ వేశారు. వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లను ప్రలోభాలకు గురిచేసి 8 మందికి పచ్చ కండువా కప్పారు. ప్రస్తుతం టీడీపీకి చెందిన ఐదుగురితో పాటు పార్టీ ఫిరాయించిన వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లను క్యాంపునకు తరలించారు. గురువారం అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టి చైర్మన్, వైస్ చైర్మన్ స్థానాలను దక్కించుకోవాలని చూస్తున్నారు.

నేడు చైర్ పర్సన్, వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం..

మడకశిర మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డిపై గురువారం అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టేందుకు టీడీపీ నేతలు సర్వం సిద్ధం చేశారు. మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మున్సిపల్ కౌన్సిల్ ప్రత్యేక సమావేశాన్ని ఉదయం 11 గంటలకు ఏర్పాటు చేశారు. ఈ ప్రత్యేక సమావేశానికి ప్రిసైడింగ్ అధికారి హోదాలో పెనుకొండ ఆర్డీఓ ఆనంద్ కుమార్ హాజరు కానున్నారు.

వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లకు విప్ జారీ..

అవిశ్వాస తీర్మానం నేపథ్యంలో వైఎస్సార్ సీపీకి చెందిన 15 మంది కౌన్సిలర్లకు పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ విప్ జారీ చేశారు. ఇందుకు సంబంధించిన పత్రాలను పెనుకొండ ఆర్డీఓ ఆనంద్ కుమార్, మడకశిర మున్సిపల్ కమిషనర్ రంగస్వామికి మడకశిర వైఎస్సార్ సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప, పార్టీ నాయకుల ద్వారా అందజేశారు. అదే విధంగా కౌన్సిలర్లకు కూడా విప్ పత్రాలను అందజేశారు.

విప్ ధిక్కరిస్తే పదవులకు చేటే



మడకశిరలో టీడీపీ నాయకులు అంబేడ్కర్ రాజ్యాంగానికి తిలోదకాలు ఇచ్చారు. రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు. టీడీపీ నాయకులు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లను ప్రలోభాలకు గురి చేసి అడ్డదారుల్లో మున్సిపాలిటీని కైవసం చేసుకోవడానికి ప్రయత్నిస్తుండటం దారుణం. మేం 15 మంది వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లకు విప్‌జారీ చేశాం. ధిక్కరిస్తే కౌన్సిలర్ పదవులు కోల్పోవడం తథ్యం.

– ఈరలక్కప్ప, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మడకశిర

గల్లీ నుంచి.. జాతీయ స్థాయికి



హిందూపురంలోని ఎంజీఎం క్రీడా మైదానంలో సాధన చేస్తున్న యామిని

ఫుట్‌బాల్ ఆటంటే వారికి చాలా ఇష్టం .. బాల్ అందుబాటులో ఉంటే చాలు ఇతరులకు ఇబ్బంది లేకుండా ఎంచక్కా వీధుల్లోనే ఆడేస్తుంటారు. ఇలా గల్లీలో మొదలు పెట్టిన ఆట వారిని జాతీయ స్థాయికి ఎదిగేలా చేసింది.

- ఫుట్‌బాల్‌లో రాణిస్తున్న ఎంజీఎం పాఠశాల విద్యార్థులు
- జాతీయ స్థాయిలో విశేష ప్రతిభ చాటుతున్న 'పురం' వాసులు



ఎంజీఎం పాఠశాల క్రీడా మైదానంలో ఫుట్‌బాల్ సాధన చేస్తున్న క్రీడాకారులు

హిందూపురం టౌన్: స్థానిక ఎంజీఎం పాఠశాల విద్యార్థులు ఫుట్‌బాల్‌లో మేటిగా రాణిస్తున్నారు. వ్యాయామ ఉపాధ్యాయుడు లోకనాథ్, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఫుట్‌బాల్ క్రీడపై మక్కువ పెంచుకున్న విద్యార్థులు రోజూ క్రమం తప్పని సాధనతో ప్రతిభను మరింత మెరుగుపరుచుకుంటున్నారు. వీరిలో 8వ తరగతి విద్యార్థిని వై.గగనశ్రీ, 7వ తరగతి విద్యార్థి పి.లోకేష్‌బాబు, 10వ తరగతి విద్యార్థిని బి.యామిని జాతీయ స్థాయిలో ఏపీ జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించి తమకు తిరుగు లేదని నిరూపించుకున్నారు.

నిరంతర సాధన

పాఠశాలలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో నిరంతర సాధన చేస్తున్నా. ఫలితంగా అండర్–14 జాతీయ స్థాయి పోటీల్లో రాణించాను. 2024లో వైజాగ్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమంగా రాణించా. జట్టు విజయంలో కీలకంగా వ్యవహరించడంతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాను. అదే సంవత్సరం జార్ఖండ్‌లో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్ర జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించాను.

– బి.యామిని, ఎంజీఎం పాఠశాల, హిందూపురం

ఉత్తమ క్రీడాకారిణిగా గుర్తింపు



అమ్మాయిలు క్రీడల్లో రాణించగలరు అని పీఈటీ లోకనాథ్ సార్ ఇచ్చిన స్ఫూర్తితో ఫుట్‌బాల్ ఆడడం మొదలు పెట్టాను. తొలిదశలోనే మండల స్థాయి నుంచి జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచి, ఉత్తమ క్రీడాకారిణిగా గుర్తింపు తెచ్చుకున్నా. అండర్ –14 విభాగంలో రాష్ట్ర జట్టులో చోటు దక్కించుకున్న నేను.. ఈ ఏడాది ఏప్రిల్‌లో జరిగిన జాతీయ స్థాయి ఫుట్‌బాల్ టోర్నీలోనూ ప్రతిభ కనబరిచాను.

– వై.గగనశ్రీ, ఎంజీఎం పాఠశాల, హిందూపురం

జాతీయ జట్టులో చోటు దక్కించుకుంటా



చిన్నప్పటి నుంచి ఫుట్‌బాల్ అంటే చాలా ఇష్టం. నా ఆసక్తిని గమనించి అమ్మ, నాన్న ప్రోత్సహించారు. పీఈటీ సూచనలతో సాధన చేసి ఆటలోని మెలకువలను తెలుసుకున్నా. అండర్ –14 బాలుర విభాగంలో 2024, అక్టోబర్‌లో హిందూపురంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా జట్టు తరఫున పాల్గొనే అవకాశం దక్కింది. అలాగే ఈ ఏడాది ఏప్రిల్‌లో మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లోనూ ప్రతిభ చూపాను. జాతీయ జట్టులో చోటు దక్కించుకోవడమే లక్ష్యంగా సాధన చేస్తున్నా.

– పి.లోకేష్‌బాబు, ఎంజీఎం పాఠశాల, హిందూపురం

క్లుప్తంగా

బీఈడీ ఫలితాల విడుదల



ఫలితాలు విడుదల చేస్తున్న ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ అనిత

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలో బీఈడీ మొదటి, మూడో సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ ఆచార్య బి.అనిత బుధవారం విడుదల చేశారు. మొదటి సెమిస్టర్‌లో 73.77 శాతం, మూడో సెమిస్టర్‌లో 82.26 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. ఫలితాలు జ్ఞానభూమి పోర్టల్‌లో చూడవచ్చు. అలాగే బీఎస్సీ, బీకాం, బీసీఏ రెగ్యులర్, సప్లిమెంటరీ ఫలితాలకు సంబంధించి రీవాల్యుయేషన్, పర్సనల్ వెరిఫికేషన్ దరఖాస్తుకు ఈ నెల 30 చివరి తేదీగా నిర్దేశించినట్లు అనిత పేర్కొన్నారు. కార్యక్రమంలో రెక్టార్ జి.వెంకటనాయుడు, రిజిస్ట్రార్ డాక్టర్ ఈ.రమేష్ బాబు, డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ జీవీ రమణ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ సి.లోకేశ్వర్లు, అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎం.శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో ఢీకొని బాలుడి మృతి



దినేష్‌కుమార్‌రెడ్డి (ఫైల్)

కదిరి టౌన్: ఆటో ఢీకొన్న ఘటనలో సైకిల్‌పై వెళుతున్న ఓ బాలుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... కదిరిలోని కుమ్మర వీధికి చెందిన వేమారెడ్డి కుమారుడు దినేష్‌కుమార్‌రెడ్డి (11) బుధవారం ఉదయం ట్యూషన్‌కు వెళ్లి తిరిగి సైకిల్‌పై ఇంటికి బయలుదేరాడు. స్థానిక మౌనిక థియేటర్ సర్కిల్ వద్దకు చేరుకోగానే వెనుకనే వేగంగా వస్తున్న ఆటో ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన దినేష్‌కుమార్‌రెడ్డిని స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించేలోపు మృతి చెందాడు. బాలుడి తాత ఆదినారాయణరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ వి.నారాయణరెడ్డి తెలిపారు.

యువకుడి బలవన్మరణం

మడకశిర రూరల్: మండలంలోని హరేసముద్రం గ్రామానికి చెందిన లోకేష్‌నాయక్ (18) అలియాస్ పరమేష్ నాయక్ ఆత్మహత్య చేసుకున్నాడు. తిరుపతిలోని ఓ పశువుల షెడ్డులో పనిచేస్తున్న లోకేష్ నాయక్... ఇటీవల ఇంటికి వచ్చి తిరిగి పనికి వెళ్లలేదు. జీతం బాగా ఇస్తున్న పనిని వదిలి ఎందుకు వచ్చావంటూ తల్లి మందలించింది. దీంతో క్షణికావేశానికి లోనైన లోకేష్‌నాయక్... బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అయ్యప్పస్వామి బంగారు విగ్రహ ప్రతిష్ట



ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న అయ్యప్పస్వామి బంగారు విగ్రహం

ధర్మవరం అర్బన్: స్థానిక కేశవనగర్‌లో నూతనంగా నిర్మించిన అయ్యప్పస్వామి ఆలయం ప్రారంభోత్సవంతో పాటు మణికంఠుడి బంగారు విగ్రహాన్ని బుధవారం వేదమంత్రాల నడుమ ప్రతిష్ఠించారు. ఆలయ వ్యవస్థాపకులు, గురుస్వామి పీజే విజయ్ కుమార్, సభ్యులు బండ్లపల్లి వెంకటజయప్రకాష్ ఆధ్వర్యంలో ప్రత్యేక హోమాలు నిర్వహించారు. సాయంత్రం అయ్యప్పస్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేక రథంపై కొలువుదీర్చి పట్టణంలో గ్రామోత్సవం నిర్వహించారు.

టీడీపీ నేత దౌర్జన్యం



దోభీఘాట్ బోరు నుంచి అక్రమంగా వేసిన పైపులైన్

కనగానపల్లి: మండలంలోని కోనాపురం చెరువు కట్ట సమీపంలో దోభీఘాట్ వద్ద పంచాయతీ నిధులతో రజకుల కోసం ఏర్పాటు చేసిన బోరుబావిని స్థానిక టీడీపీ నేత కబ్జా చేశాడు. బోరుబావి నుంచి ప్రత్యేకంగా పైపులు ఏర్పాటు చేసుకుని నీటిని తన పొలానికి మళ్లించుకుంటున్నాడు. దీంతో నీటి సౌకర్యం లేక రజకులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలోనూ ఇదే బోరుబావి నుంచి గ్రామంలోని ఓ రైతు కొన్ని రోజుల పాటు తన పొలానికి నీరు పెట్టుకున్న విషయం తెలిసిందే. దీనిపై అప్పట్లో అభ్యంతరం తెలిపిన స్థానిక టీడీపీ నాయకులు తిరిగి ఆ పార్టీకి చెందిన వ్యక్తి దౌర్జన్యంగా నీరు మళ్లించుకుంటుంటే ఎందుకు మాట్లాడటం లేదని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఈ అంశంపై పంచాయతీ కార్యదర్శి విశ్వనాథ్‌ను వివరణ కోరగా... ఇప్పటికే ఈ విషయంపై ఫిర్యాదులు అందాయని, బోరు కబ్జా చేసిన వ్యక్తికి నోటీసులు అందజేసి పైపులైన్ తొలగిస్తామని పేర్కొన్నారు.

మామిడి చెట్ల నరికివేత



లేపాక్షి: స్థానిక బింగిపల్లి మార్గంలో రైతు ముక్తియార్‌కు చెందిన మామిడి తోటలో 42 చెట్లను మంగళవారం రాత్రి దుండగులు నరికి వేశారు. బాధితుడు తెలిపిన మేరకు... తనకున్న 2.50 ఎకరాల పొలంలో మూడేళ్లుగా మామిడి మొక్కలను పెంచుతున్నట్లు తెలిపాడు. ఈ ఏడాది కాపు దశకు వచ్చాయన్నారు. బుధవారం ఉదయం తోట వద్దకు చేరుకోగా 175 మామిడి చెట్లలో 42 మామిడి చెట్లను నరికి వేసినట్లుగా గుర్తించి, పోలీసులకు ఫిర్యాదు చేశానన్నారు. ఘటనపై పోలీసులు మాట్లాడుతూ.. రైతు ఫిర్యాదు మేరకు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నామని పేర్కొన్నారు.

రూ.14,051 కోట్లతో వార్షిక రుణ ప్రణాళిక

- విడుదల చేసిన కలెక్టర్ చేతన్

ప్రశాంతి నిలయం: వార్షిక రుణ ప్రణాళిక (2025–26)ను కలెక్టర్ టీఎస్ చేతన్ బుధవారం విడుదల చేశారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో సంప్రదింపుల కమిటీ జిల్లా స్థాయి సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన లక్ష్య సాధనపై చర్చించారు. వార్షిక రుణ ప్రణాళికలో అత్యధికంగా వ్యవసాయ రంగానికి రూ.10,341 కోట్లు, ఆ తర్వాత పంటరుణాలకు రూ.7,587 కోట్లు, ఎంఎస్ఎంఈకి రూ.1,302 కోట్లు, గృహ నిర్మాణాలకు రూ.145 కోట్లు, విద్యారంగానికి రూ.60 కోట్లు, అప్రాధాన్యత రంగాలకు రూ.1,983 కోట్లు, ఇతర రంగాలకు రూ. రూ.210 కోట్లు కేటాయించారు. గత ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయ రుణాల లక్ష్యం రూ.9,972 కోట్లు కాగా, రూ.7,054 కోట్లు మంజూరు చేశామన్నారు. ముద్ర రుణాల లక్ష్యం రూ.495 కోట్లు కాగా, రూ. 534 కోట్లు మంజూరు చేశామన్నారు. అర్హులందరికీ రుణాలిచ్చి ఆర్థిక ఎదుగుదలకు సహకరించాలని బ్యాంకర్లను ఆదేశించారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ రమణకుమార్ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా రుణాల మంజూరు వివరాలను తెలిపారు. అనంతరం జిల్లా 'వార్షిక ప్రణాళిక 2025–26'ను కలెక్టర్ విడుదల చేశారు. సమావేశంలో ఆర్‌బీఐ ప్రతినిధి రోహిత్ అగర్వాల్, గంగాధర్, పరిశ్రమల శాఖ మేనేజర్ నాగరాజు, మత్స్యశాఖ అధికారి చంద్రశేఖర్‌రెడ్డి, డిక్కీ ప్రతినిధి వెంకటరమణ, గిరిజన సంక్షేమ శాఖ అధికారి మోహన్‌రావు, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శివరంగ ప్రసాద్, బ్యాంక్, నాబార్డ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

వడగాల్పుల బాధితుల కోసం ఏర్పాట్లు చేయండి..

జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వడగాల్పుల బాధితుల కోసం ప్రత్యేకంగా 5 పడకలను ఏర్పాటు చేయాలని జిల్లా వైద్యాధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ నెల 17న 'స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర' కార్యక్రమం నిర్వహించే అంశంపై బుధవారం కలెక్టరేట్‌లో అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. వడగాలుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రజలందరికీ వివరించాలన్నారు. కార్యక్రమంలో డీపీఓ సమత, గ్రామ/వార్డు సచివాలయాల నోడల్ అధికారి సుధాకర్‌రెడ్డి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

16న లేపాక్షి నంది పోస్టల్ స్టాంప్ ఆవిష్కరణ

హిందూపురం: భారత తపాలా శాఖ హిందూపురం డివిజన్ ఆధ్వర్యంలో లేపాక్షిలోని నంది నమూనాతో రూపొందించిన శాశ్వత పిక్టోరియల్ కాన్సిలేషన్ (పోస్టల్ మార్క్/స్టాంప్)ను ఈ నెల 16న విడుదల చేయనున్నారు. ఈ మేరకు హిందూపురం పోస్టల్ డివిజల్ సూపరింటెండెంట్ యు.విజయకుమార్ బుధవారం తెలిపారు. వీరభద్రస్వామి దేవస్థానంపై ప్రత్యేకంగా రూపొందించిన పిక్చర్ పోస్టుకార్డుతో పాటు లేపాక్షి నంది నమునాతో పర్మనెంట్ పిక్టోరియల్ కాన్సిలేషన్‌ను ఆవిష్కరించనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమానికి ఏపీ సర్కిల్ చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ కె.ప్రకాష్‌తో పాటు రీజియన్ పోస్ట్‌మాస్టర్ జనరల్ డాక్టర్ వనం ఉపేంద్ర ముఖ్యఅతిథులుగా హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.

ఎమ్మెల్యే కందికుంట మనుషులమంటూ అక్రమ వసూళ్లు

కదిరి టౌన్: స్థానిక ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ మనుషులమంటూ కొందరు అక్రమ వసూళ్లకు తెరలేపారు. కదిరి పట్టణం మీదుగా వెళుతున్న లారీలను కొందరు ఆపి బెదిరింపులతో డబ్బు వసూళ్లకు తెరలేపారు. ఈ విషయంపై ఎమ్మెల్యే సూచన మేరకు రంగంలో దిగిన సీఐ నారాయణరెడ్డి సమగ్ర విచారణ చేపట్టి నిగ్గు తేల్చారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. తాము ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ మనుషులమని కొందరు, టీడీపీ సానుభూతిపరులమని మరికొందరు, పాత్రికేయులమంటూ ఇంకొందరు లారీ డ్రైవర్లను బెదిరించి డబ్బు వసూళ్లకు పాల్పడుతున్నది వాస్తవమని విచారణలో బహిర్గతమైందన్నారు. ఇకపై ఎక్కడైనా లారీ డ్రైవర్లను బెదిరించి డబ్బు వసూళ్లకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పూర్వపు డీఈఓ ఆనందమూర్తి మృతి



ఆనందమూర్తి (ఫైల్)

అనంతపురం ఎడ్యుకేషన్: పూర్వపు జిల్లా విద్యాశాఖ విశ్రాంత అధికారి సెట్టేల ఆనందమూర్తి (74) కన్నుమూశారు. అనంతపురంలోని అరవిందనగర్‌లో ఆయన నివాసం ఉంటున్న ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. వారం రోజుల క్రితం ఆస్పత్రిలో చేరిన ఆయన పరిస్థితి విషమించి బుధవారం మృతి చెందారు. ఆనందమూర్తి సొంతూరు శెట్టూరు మండలం ములకలేడు గ్రామం. భార్య 2008లోనే మృతి చెందారు. ముగ్గురు కుమారులు సంతానం కాగా... ఇద్దరు హిందీ పండిట్లుగా, ఒకరు పీఈటీగా విధులు నిర్వహిస్తున్నారు. స్వగ్రామంలో గురువారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా.. 1980లో జేఎల్‌గా ఉద్యోగంలోకి చేరిన ఆనందమూర్తి పదోన్నతి పొంది 1996 నుంచి 2004 వరకు పరిషత్ ఎడ్యుకేషన్ ఆఫీసర్‌గా పని చేశారు. తర్వాత 2004 నుంచి 2006 వరకు జిల్లా విద్యాశాఖ అధికారిగా విధులు నిర్వర్తించారు. ఆ తర్వాత ఐటీడీఏ, ఎస్సీఈఆర్టీలో పని చేసి 2008లో రిటైర్డ్ అయ్యారు. ఆయన మృతిపై ఎంఈఎఫ్ నాయకులు బండారు శంకర్, హనుమంతరావు, రమేష్, రామన్న తదితరులు సంతాపం తెలియజేసి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

'సింగిల్ ఆర్డర్ల'తో సంచలనం..

ఆనందమూర్తి డీఈఓగా పనిచేసిన కాలంలో జిల్లాలో టీచర్ల బదిలీలకు సంబంధించి 'సింగిల్ ఆర్డర్ల' అంశం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ప్రభుత్వం జారీ చేసిన బదిలీలతో పాటు ఆయా ఖాళీలకు డీఈఓ సింగిల్ ఆర్డర్ ఇచ్చి బదిలీలు చేశారు. ఒత్తిళ్ల కారణంగా డీఈఓ కొన్ని ఆర్డర్లు ఇస్తే వాటిని అడ్డుపెట్టుకుని బ్లాక్‌మెయిల్ చేసి అప్పట్లో కొందరు ఉపాధ్యాయ సంఘాల నాయకులు తమకు అనుకూలమైన వారికి చాలా ఆర్డర్లు ఇప్పించుకున్నారు. కొందరు డీఈఓ సంతకాలను ఫోర్జరీ చేసి ఆర్డర్లు ఇచ్చిన అంశం దుమారం రేగడంతో ఆయనను విశాఖ జిల్లా అరకు ఐటీడీఏకు బదిలీ చేశారు.

చికిత్సకు స్పందించక కియా ఉద్యోగి మృతి

ధర్మవరం అర్బన్: ఉద్యోగంలో పని ఒత్తిడి తాళలేక ఆత్మహత్యాయత్నం చేసిన కియా ఉద్యోగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... ధర్మవరంలోని పీఆర్టీ వీధికి చెందిన కావలి గౌరీప్రసాద్ (23) ఇంటర్ వరకు చదువుకున్నాడు. కుటుంబ ఆర్థిక పరిస్థితి సరిగా లేని కారణంగా ఉన్నత చదువులు అభ్యసించలేక కియా పరిశ్రమలో కార్మికుడిగా చేరాడు. పరిశ్రమలో పని ఒత్తిడి తాళలేక చనిపోయావలని అనుకుంటున్నట్లు పలు మార్లు కుటుంబసభ్యులతో చెప్పుకుని బాధపడ్డాడు. ఆ సమయంలో తల్లిదండ్రులు నచ్చ చెప్పడంతో సర్దుకుపోతూ వచ్చాడు. ఈ నేపథ్యంలో గత మంగళవారం మధ్యాహ్నం తన అన్న పృథ్వీరాజ్‌కు ఫోన్ చేసి, తాను విషపూరిత ద్రావకం తాగినట్లు తెలిపాడు. దీంతో పృథ్వీరాజ్ ఇంటికి చేరుకుని అప్పటికే అపస్మారకస్థితికి చేరుకున్న గౌరీప్రసాద్‌ను వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లాడు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో బుధవారం ఆస్పత్రిలో మృతిచెందాడు. ఘటనపై సీఐ నాగేంద్రప్రసాద్ దర్యాప్తు చేపట్టారు.

కుక్కను తప్పించబోయి వ్యక్తి...

మడకశిర రూరల్: రోడ్డుకు అడ్డంగా వచ్చిన కుక్కను తప్పించబోయి ఓ ద్విచక్ర వాహనదారుడు మృతి చెందాడు. వివరాలు.. మడకశిరకు చెందిన అమానుల్లా (54), బాబు బుధవారం ఉదయం వ్యక్తిగత పనిపై హిందూపురానికి వెళ్లారు. అక్కడ పని ముగించుకున్న అనంతరం ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమైన వారు... మడకశిర మండలం బుళ్లసముద్రం గ్రామ సమీపంలోని త్రిమూర్తి ఫామ్‌హౌస్ వద్దకు చేరుకోగానే రోడ్డుకు అడ్డంగా వచ్చిన కుక్కను తప్పిచబోయి ద్విచక్రవాహనం అదుపు తప్పడంతో కిందపడ్డారు. తీవ్ర గాయాలైనా అమానుల్లా, బాబును స్థానికులు వెంటనే మడకశిరలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అమానూల్లాను హిందూపురంలోని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు.

యువకుడి ప్రాణాలు కాపాడిన పోలీసులు

పుట్టపర్తి టౌన్: ప్రియురాలితో పెళ్లి విషయంగా నెల కొన్న సమస్యతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యాయత్నం చేయబోయిన యువకుడిని పోలీసులు సకాలంలో గుర్తించి కాపాడారు. వివరాలు.. కొత్తచెరువులోని బీసీ కాలనీకి చెందిన ఓ యువకుడు అదే గ్రామానికి చెందిన ఓ యువతిని కొన్ని నెలలుగా ప్రేమిస్తున్నాడు. రెండు రోజులు క్రితం పెళ్లి విషయంలో ఇద్దరి మధ్య సమస్య వచ్చింది. సమస్య పరిష్కరించుకోవడంలో విఫలమైన యువకుడు బుధవారం ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకొని కొత్తచెరువు సమీపంలో ఉన్న రైలు పట్టాలపైకి చేరుకున్నాడు. అనంతరం తాను ప్రేమించిన అమ్మాయితో గొడవలు వచ్చాయని, సమస్య పరిష్కారం కాకపోవడంతో ఆత్మహత్య చేసుకుంటున్నట్లు సెల్ఫీ వీడియో తీసి వైరల్ చేశాడు. ఈ వీడియోను గమనించిన ఎస్పీ రత్న, డీఎస్పీ విజయకుమార్ ఆదేశాల మేరకు అప్రమత్తమైన కొత్తచెరువు అప్‌గ్రేడ్ పోలీసులు వెంటనే రైలు పట్టాల వద్దకు చేరుకుని గాలింపు చేపట్టారు. అప్పటికే పట్టాలపై వస్తున్న రైలుకు ఎదురుగా నిలబడిన యువకుడిని గమనించి పక్కకు లాగి స్టేషన్‌కు పిలుచుకెళ్లి కౌన్సిలింగ్ అనంతరం తల్లిదండ్రులకు అప్పగించారు.

గ్రంథాలయాలు... విజ్ఞాన వీచికలు

రోజూ ఉదయం కార్యక్రమాలు ఇలా	
సమయం	కార్యక్రమం
8 నుంచి 8.30గంటల వరకు	కథలు చెప్పడం
8.30 నుంచి 9 గంటల వరకు	పుస్తక పఠనం
9 నుంచి 9.30 గంటల వరకు	చిత్రలేఖనం
9.30 నుంచి 10 గంటల వరకు	స్పోకెన్ ఇంగ్లిష్
10 నుంచి 10.30 గంటల వరకు విరామం	
10.30 నుంచి 11 గంటల వరకు	కథలు చెప్పడం
11 నుంచి 11.30 గంటల వరకు	అతిథుల స్ఫూర్తిదాయక ప్రసంగాలు
11.30 నుంచి 12 గంటల వరకు	నృత్యాలు, నాటికలు, బొమ్మల తయారీ



పుట్టపర్తి గ్రంథాలయంలో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయులు

- విద్యార్థుల్లో సృజనాత్మకత, విజ్ఞానాన్ని పెంపొందించడమే లక్ష్యం
- మండలాల వారీగా ప్రారంభమైన వేసవి విజ్ఞాన శిబిరాలు
- ఉత్సాహంగా పాల్గొంటున్న విద్యార్థులు

పుట్టపర్తి టౌన్: వేసవి సెలవులంటే పిల్లలకు సరదా. ఆ సెలవుల కోసమే పిల్లలు వెయ్యి కళ్లతో ఎదురుచూస్తుంటారు. వేసవి సెలవులకు నువ్వెక్కడికి వెళ్తావంటే, నువ్వెక్కడికి వెళ్తావు? అంటూ చిన్నారుల మధ్య జరిగే సంభాషణ ఎంతో ఆసక్తికరంగా ఉంటుంది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చిన తర్వాత బాల్యం సెల్‌ఫోన్‌కు బందీ అయింది. దీంతో బాల్యానికి ఆప్యాయత, అనురాగం, ప్రేమ, లాలిత్యం దూరమయ్యాయి. ఈ నేపథ్యంలోనే చిన్నారులకు దూరమైన బాల్యం యొక్క మాధుర్యాన్ని రుచి చూపించేలా జిల్లా గ్రంథాలయ సంస్థ ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతోంది. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లోని గ్రంథాలయాల్లో జూన్ 6వ తేదీ వరకు 40 రోజుల పాటు వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహిస్తున్నారు. వివిధ తరగతులకు చెందిన 2,200 మంది విద్యార్థులు హాజరవుతున్నారు. రోజూ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఇందులో వినోదంతో పాటు బాలల సాహిత్యం, కథలు వినడం, కథలు చెప్పడం, కథలు చదివించడం, పుస్తక సమీక్ష, చిత్రలేఖనం, రంగులు వేయడం, కాగితంతో కళారూపాలు తయారు చేయడం, సంగీతం, బొమ్మల తయారీ, నటన, యోగా, చదరంగం, క్యారమ్స్, క్విజ్, జీకే, స్పోకెన్ ఇంగ్లిష్, మొదలగు అంశాలపై శిక్షణ ఇస్తున్నారు. పలు పాఠశాలలకు చెందిన నిష్ణాతులైన ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ తీసుకుని విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీసేలా ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టారు.

కొత్త విషయాలు నేర్చుకుంటున్నా



మా ఊరి గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరానికి రోజూ హాజరవుతున్నా. ఆటలు, పాటలు, పుస్తకాలు చదివిస్తున్నారు. హ్యాండ్ రైటింగ్‌పై శిక్షణ ఇస్తున్నారు. బొమ్మలు ఎలా గీయాలో నేర్పిస్తున్నారు. ఇంకా చాలా కొత్త విషయాలు ఇక్కడ నేర్చుకుంటున్నా.

– ఐశ్వర్య, 9వ తరగతి విద్యార్థి, పుట్టపర్తి

కథలు బాగున్నాయి



ఇక్కడ చెబుతున్న కథలు ఎంతో బాగున్నాయి. కథ చెప్పిన తర్వాత అందులోని నీతిని వివరిస్తున్నారు. అలాగే మంచి కథల పుస్తకాలు చదివించి, అందులోని సారాంశాన్ని మాతోనే వివరించి రాబట్టుకుంటున్నారు. దీంతో మాలో మరింత ఆసక్తి పెరుగుతోంది.

– సాయి గణేష్, 10వ తరగతి విద్యార్థి, పుట్టపర్తి

సద్వినియోగం చేసుకోవాలి



జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలను బాలబాలికలు సద్వినియోగం చేసుకోవాలి. చదువుతో పాటు ఆటపాటల్లో శిక్షణ ఇస్తున్నాం. ఇందు కోసం ప్రత్యేకంగా ఉపాధ్యాయుల సహకారం కూడా తీసుకున్నాం. విజ్ఞానాన్ని పంచే ఈ శిబిరాలను చిన్నారులు సద్వినియోగం చేసుకునేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలి.

– రమ, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి